# సత్యమేవ జయతే

ఒక ఊరి పొలిమేరలో ఒక ఆవు పచ్చగడ్డి మేస్తూ ఉంది. పక్కనున్న అడవి నుంచి ఒక పెద్దపులి అక్కడకు వచ్చి ఆవుని చంపబోయింది. ఆవు తప్పించుకొని, “ఓ పులి మహారాజా, ఊరిలో నాకొక చిన్న లేగదూడ ఉంది. అది నా పాల కోసమై ఎదురు చూస్తూ ఉంటుంది. నేను ఇప్పుడే వెళ్ళి నా దూడకు పాలు ఇచ్చి వచ్చేస్తాను. ఆ తరువాత నన్ను చంపి నీవు తిను. నన్ను నమ్ము తప్పక వచ్చేస్తాను” అని బతిమాలింది, పులిని. అయితే పులికి ఏ మాత్రం నమ్మకం కలుగలేదు. అయినా ఏలాగో ఒప్పుకుంది. దూడకు పాలు ఇచ్చి మంచి బుద్దులు చెప్పి, తిరిగి వచ్చేసి “ఓ పులిరాజా, నీవు ఇప్పుడు నన్ను చంపి తిని” అని కోరింది. పెద్దపులి క్రూరమృగం అయినా దానికి, ఆవు నిజాయితీ పట్ల ఆశ్చర్యం వేసింది. మెచ్చుకొని ఆవును చంపకుండా “నీవు వెళ్ళి, నీ దూడతోనే హాయిగా ఉండు” అని పంపి వేసింది. సత్యం, నిజాయితీ అపాయంనుండి కాపాడతాయి, మరి!!